"ఏంరోయ్... ఏంటి కథ... మాట్లాడితే వెళ్ళిపొమ్మంటున్నావ్?" అనుమానంగా చూస్తూ అడిగాడు పర్వతాలరావు.

వెళ్ళిపొమ్మని ఇంక అతిగా ఫోర్స్ చేస్తే వాళ్ళకి లేనిపోని అనుమానాలు కలుగుతాయని బుచ్చిబాబుకి అర్థం అయిపోయింది.

"అంటే... మీకు అనవసరంగా శ్రమని వెళ్ళిపొమ్మన్నా... నాకేం? హిహి!" అన్నాడు బుచ్చిబాబు చేతిలోని సూట్‌కేస్‌ని నేలమీద పెట్టేస్తూ.

"అదేంటి సూట్‌కేసుని ఇక్కడే తగలేస్తున్నావ్? నీది ఎస్-2 కోచ్ అన్నావుగా. మనం మరి కాస్త ముందుకెళ్ళాలేమో... ఆ కోచ్ ముందుకు వస్తుందనుకుంటా!" అన్నాడు పర్వతాలరావు.

"మనం ఇక్కడే వెయిట్ చేద్దాం నాన్నా... బండి వచ్చాక చూద్దాంలే..." అన్నాడు వాళ్ళిద్దరికి అడ్డుగా అటూ ఇటూ కదుల్తూ.

బుచ్చిబాబు ప్రవర్తనకి ముందు సీత తెల్లబోయినా తర్వాత అతని తల్లిదండ్రుల్ని చూసిన ఆమెకి పరిస్ధితి అర్థం అయిపోయింది.

అందుకే సీత క్రిందున్న సూట్ కేస్ అందుకుని మెల్లగా స్తంభంవెనక్కి వెళ్ళి నిల్చుంది.
"ఏంటా ఊగడం? ఏదైనా పింజారీ సినిమా పాటకి స్టెప్పులేస్తున్నావా?" చిరాగ్గా చూస్తూ బుచ్చిబాబుని ప్రశ్నించాడు పర్వతాలరావు.

"అంటే రైలు కోసం ఎదురుచూస్తూ ఖాళీగా నిల్చుంటే బోరు కొట్టి...." మెలికలు తిరిగాడు బుచ్చిబాబు.

"మరీ అంతిదిగా మెలికలు తిరిగిపోకు. కాళ్ళు మెలిపడి బోర్లా పడిపోగలవు"

అంతలో మైకులో అడ్డదిడ్డంగా ఓ అనౌన్స్‌మెంటు వచ్చింది "ప్యాసింజర్లకి ఒక్క ముఖ్య గమనిక! కొద్ది క్షణాలలో విషాకపట్నం వెళ్లే గోదావ్రరి ఎస్‌ప్రెస్ వక్టో నెంబర్ర్ ప్లాట్‌ఫారము మీదకి చచ్చును...క్షమించండి వచ్చును"

బుచ్చిబాబు ఊగుతూనే మెల్లగా వెనక్కి తిరిగి చూశాడు. అతనికి ఇందాక సీత నిల్చుని వున్నచోట కనిపించలేదు. బుచ్చిబాబుకి కంగారు పుట్టింది.

ఏది సీత? కొంపదీసి అమ్మా నాన్నలను చూసి వెళ్ళిపోయిందా? అతని కళ్లు ఆందోళనగా వెతికాయి. ఇప్పుడెలా అని అతను అనుకుంటుండగానే స్తంభం చాటునుండి సీత చీర కనిపించింది.

హమ్మయ్యా అని బుచ్చిబాబు తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు. సరిగ్గా అప్పుడే గోదావరి ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాం మీదకి ధడాధడా శబ్దం చేస్తూ వచ్చి ఆగింది.

"ఒరేయ్ వెధవాయ్... నీ యస్-2 బోగి మనల్ని దాటి ముందు కెళ్ళిపోయింది, పద పద..." అంటూ కంగారు పెట్టేశాడు పర్వతాలరావు.

"అబ్బ...ఉండు నాన్నా! రైలు రాగానే పరుగులు తీసి తోసుకుని ఎక్కితే నన్నందరూ పల్లెటూరి గబ్బిలాయ్ అనుకుంటారు. రైలు ఓ పావుగంట వుంటుందిలే?" అన్నాడు

బుచ్చిబాబు ఓరకంట సీత ఏం చేస్తుందో గమనిస్తూ.

సీత స్తంభం చాటునుండి చటుక్కున బయటికి వచ్చి ఎస్-2 బోగిలోకి ఎక్కడం చూశాడు బుచ్చిబాబు .

రెండు నిముషాలు గడిచాయ్....

"ఏరా ఎబ్రాసెధవా... రైలు కదిలి వెళ్ళిపోయేదాకా ఇలానే గెడ కర్రలా నిలబడి పోతావా యేం? పద పద ...." అంటూ కంగారు పెట్టేశాడు పర్వతాలరావు.

బుచ్చిబాబు సూట్ కేస్ అందుకుని బరువెక్కిన గుండెతో అడుగులు ముందుకు వేశాడు.

ఎస్-2 బోగీ దగ్గరకు వచ్చాక సూట్ కేస్ మళ్ళీ కిందపెట్టేసి నిలబడిపోయాడు బుచ్చిబాబు

"అదేంటి... మళ్ళీ ఇక్కడ ఆగిపోయావు ... నీకంతా బుర్ర తిరుగుడు వ్యవహారంలా వుందే? లోపలికి పద" అంటూ పర్వతాలరావు రైలెక్కబోయాడు.

బుచ్చిబాబు కెవ్వుమని అరిచాడు.

"ఏంటి నాన్నా.... నువ్వెందుకు ఎక్కుతున్నావు. ఊరు వెళుతున్నది నేను" కంగారుగా అన్నాడు.

"నువ్వేలేవోయ్... ఓ అయిదు నిముషాలు లోపల కూర్చుని దిగిపోతాం... నువ్వు రావే" అన్నాడు పర్వతాలరావు.

పార్వతమ్మ కూడా రైలు ఎక్కబోయింది.

"హబ్బ"

బుచ్చిబాబు తలని కంపార్టుమెంట్ కేసి బాధగా కొట్టుకున్నాడు.

"మళ్ళీ ఏమైందిరా వెధవాయ్" అడిగాడు పర్వతాలరావు.

"మీరు ఎక్కడానికి వీల్లేదంతే"

"అదే ఎందుకు వీల్లేదని? నీకేంటి అభ్యంతరం?"

"హబ్బ..." మళ్ళీ కంపార్టుమెంట్ కేసి తల కొట్టుకున్నాడు బుచ్చిబాబు.

"అబ్బా! వాడినెందుకండీ అలా బాధపెట్టడం... మీరు దిగండి" అంటూ పార్వతమ్మ కిందకి దిగేసింది.

పర్వతాలరావు కిందకి దిగి అడిగాడు.

"అయినా మేం లోపల కూర్చుంటే నీకేంటిరా బాధా?"

"ఏం లేదు నాన్నా రైలు సడెన్‌గా కదిలిదంటే దిగడం మీకెంత కష్టం? ఈ మధ్య ఆఫీసులో పనిచేసే అతని తండ్రికూడా ఇలానే కొడుకు ఊరెళ్తుంటే అతనితోపాటు రైలెక్కి కాస్సేపు కూర్చుని రైలు కదిలే టైంకి కంగారుగా కిందకి తూలి రైలు క్రిందకి పడి రెండు కాళ్ళూ పోగొట్టుకున్నాడు. అందుకే అంతగా బాధపడుతున్నా"

"చూసారా మన అబ్బాయికి ఎంత జాగ్రత్తో పాపం" మురిసిపోతూ అంది

పార్వతమ్మ.

"ఏడవలేకపోయావ్ వెధవాయ్ పోనీ నువ్వయినా ఎక్కు...." అన్నాడు పర్వతాలరావు .

బుచ్చిబాబు రైలెక్కి సీత దగ్గర తన సూట్‌కేస్ పెట్టి "ఎందుకయినా మంచిది రైలు కదిలేదాకా నువ్వు బాత్రూంలో వుండు" అని చెప్పి మళ్ళీ రైలు దిగిపోయాడు.
తన రైల్లోనే కూర్చుంటే కిటికీలోంచి చూసే తల్లి దండ్రులకు సీత కనిపిస్తుందేమోనని బుచ్చిబాబు భయం.

"అదేంట్రా వెధవాయ్ మళ్ళీ దిగిపోయావు?" అడిగాడు పర్వతాలరావు.

"నేను రైలు లోపల మీరు బయటా ఏం బావుంటుందని దిగాను. రైలు కదిలే సమయానికి ఎక్కుతాను" అన్నాడు బుచ్చిబాబు.

పార్వతమ్మ బుచ్చిబాబుకి అన్ని రకాల జాగ్రత్తలు చెప్పింది. సెలవుల్లో వచ్చి వెళుతుండమని పర్వతాలరావు బుచ్చిబాబుకి చెప్పాడు. ఇంతలో గార్డు విజిల్ వేసి జండా ఊపాడు.

బుచ్చిబాబు కంగారుగా రైలు ఎక్కాడు. కూతపెట్టి రైలు ముందుకు కదిలింది. ప్లాట్‌ఫాం మీద తల్లిదండ్రులు కనుమరుగు అయ్యేదాకా టాటా చెప్పి తర్వాత తేలిగ్గా ఊపిరి పీల్చుకుని లోపలికి తన సీటు దగ్గరికి వెళ్ళాడు. సీత అప్పుడే బాత్రూంనుండి వచ్చి కూర్చుంది.
బుచ్చిబాబు ఆమె పక్కన కూర్చుని ఆమె భుజంమీద తల వాల్చేస్తూ "హమ్మయ్యా" అన్నాడు, రైలు వేగం పుంజుకుంది.

13

బుచ్చిబాబు ఉలిక్కిపడి నిద్రలేచాడు.

"బుచ్చీ....బుచ్చీ...." సీత బుచ్చిబాబు భుజంమీద తడుతూ వుంది.

కళ్ళు తెరిచి సీతవంక చూశాడు బుచ్చిబాబు.

"విజయవాడ వచ్చేసింది" అంది సీత. చటుక్కున బెర్తుమీద నుండి లేచాడు బుచ్చిబాబు . గబగబా దుప్పట్లు, తలగడలూ చుట్టేసి తాడుతో కట్టేశాడు.

"అబ్బ! ఇలా అర్ధరాత్రి ఊరొచ్చే ట్రైన్ ప్రయాణం చాలా బోర్ అసలు పడుకున్నట్టే ఉండదు" అన్నాడు బుచ్చిబాబు రైలు కిటికీలోంచి బయటికి చీకట్లోకి చూస్తూ.

"అవును" ఆవులిస్తూ అంది సీత .

రైలు స్పీడు తగ్గి స్లో అయ్యింది ఓ అయిదు నిముషాల్లో విజయవాడ ప్లాట్‌ఫాం మీద ఆగింది. బుచ్చిబాబు సీత సామాన్లు తీసుకుని ప్లాట్‌ఫాం మీదకి దిగేశారు. బుచ్చిబాబు చూపులు ప్లాట్‌ఫాం మీద వెతకసాగాయి.

"మీ ఫ్రెండ్ వచ్చినట్టు లేడు కదూ?" అంది సీత.

"లేదు...తప్పకుండా వస్తాడు" బుచ్చిబాబు ప్లాట్‌ఫాం మీద హడావుడిగా తిరిగే జనాన్ని చూస్తూ.

"ఎలాగయినా ఇంత అర్ధరాత్రి అతనికి రావడం కష్టమే"

"అయినా వస్తాడు. ఎందుకంటే మనకి ఇల్లుచూసి పెట్టింది కూడా వాడే. ఆ ఇల్లు ఎక్కడుందో నాకు తెలీదు. ఇప్పుడు వాడొచ్చి మనల్ని రిసీవ్ చేసుకుని ఆ ఇంటికి తీసుకెళతాడు."

"పాపం అతనికి చాలా శ్రమే" అంది సీత .

"శ్రమేం వుంది? ఫ్రెండ్ కోసం ఆ మాత్రం చెయ్యలేడా?"

"ఇంతకి అతను నీకెలా తెలుసు?"

"మేమిద్దరం కాలేజిలో క్లాస్‌మేట్స్‌మి. ఇప్పుడు వాడు కూడా మా ఆఫీసులోనే పని చేస్తున్నాడు. ఇక్కడే...... ఈ విజయవాడ బ్రాంచీలో"

"బాగానే వుంది. అయితే ఇక్కడ మీకు కాలేజ్‌మేట్ దొరికాడన్న మాట" నవ్వుతూ అంది సీత.

"వాడు ఉండబట్టే మనకి ఇల్లు చూసిపెట్టాడు" అన్నాడు బుచ్చిబాబు .

ఓ నిముషం గడిచాక బుచ్చిబాబు ఫ్రెండ్ హడావుడిగా వగరుస్తూ వాళ్ళ దగ్గరికి వచ్చాడు.

"సారీరా బుచ్చిబాబు ..నిద్ర పట్టేసింది. అందుకే రావడం ఆలస్యం అయింది" అన్నాడు అతను.

"మరేం ఫరవాలేదు. మేం వచ్చి అయిదు నిమిషాలే అయింది" అన్నాడు బుచ్చిబాబు.

"పద వెళ్దాం" వెనక్కి తిరిగాడు అతను.

"ఒక్క నిముషం" అతన్ని ఆపాడు బుచ్చిబాబు.

అతను ఆగి బుచ్చిబాబు వంక ప్రశ్నార్థకంగా చూసాడు.

"ఇతను నా ఫ్రెండ్ మోహన్!" సీతకి పరిచయం చేస్తూ అన్నాడు బుచ్చిబాబు.

సీత మోహన్‌కి నమస్కారం పెట్టింది. మోహన్ కూడా ప్రతి నమస్కారం చేసాడు.

అప్పుడు చూసాడు మోహన్ సీతని.

"ఈమె సీత?" చెప్పాడు బుచ్చిబాబు .

"సీతా? అంటే?" సందేహంగా అడిగాడు మోహన్.

బుచ్చిబాబు అప్పటికే నాలుగడుగులు ముందుకు వేశాడు. బుచ్చిబాబుకి తన ప్రశ్న వినిపించిందో, వినిపించీ పట్టించుకోలేదో మోహన్‌కి తెలీలేదు.

బుచ్చిబాబుని మోహన్, సీత అనుసరిస్తూ స్టేషన్ బయటకి నడిచారు.

0 0 0

ట్రింగ్ ట్రింగ్ .... ట్రింగ్ ట్రింగ్

డోర్ బెల్ మోగసాగింది.

"అబ్బా! ఎవరయ్యా బాబూ పొద్దునే సిల్లీగా బెల్ మోగిస్తున్నారు? అమ్మా! కాస్త తలుపు

తీసి చూడవే?" విసుక్కుంటూ అని దుప్పటి మొహం మీదకి లాక్కున్నాడు బుచ్చిబాబు.

వెంటనే కిలకిలా సీత నవ్వు వినిపించింది. ఆ నవ్వు విన్న బుచ్చిబాబు మత్తు సగం వదలింది. మొహంమీద నుండి దుప్పటి తీసేసి క్రిందకి వంగి చూశాడు. నేలమీద చాపమీద పడుకుని వున్న సీత నవ్వుతూ లేచి కూర్చుంది.

"ఏం? ఇంకా మీ ఊరు వదిలి రాలేదా? మనం ఇప్పుడు విజయవాడలో వున్నాం సిల్లీగా" వెక్కిరింపుగా అని క్రింది నుండి లేచి బయటికి వెళ్ళి వీధి తలుపు గడియ తీసింది సీత.

బయట పాలవాడు వున్నాడు.

"బుచ్చిబాబుగారేనా?" అడిగాడు వాడు.

"కాదు .... నా పేరు సీత !" చెప్పింది సీత.

పాలవాడు సిగ్గుపడుతూ మెలికలు తిరుగుతూ నవ్వాడు.

"అదేనమ్మా ... ఇది బుచ్చిబాబుగారిల్లే కదా అని అడిగాను. మోహన్ బాబుగారు ఈయాల్టి నుండీ మీకు పాలు ఇమ్మన్నారు"

"ఓ.....ఆయన పంపారా? ఉండు ఉండు"

సీత లోపలకెళ్లి వంట గదిలోంచి ఓ గిన్నె పట్టుకొచ్చింది.

"ఎంత ఇమ్మంటారమ్మ?" అడిగాడు వాడు.

"లీటర్" చెప్పింది.

"లీటర్ పాలమ్మా? పిల్లలు లేరామ్మా?" అడిగాడు వాడు.

"లేరు"

"ఓ అయితే కొత్తగా పెళ్ళయిందన్నమాట!"

వీడెవడో అధిక ప్రసంగిలా ఉన్నాడనుకుంది. సీత "త్వరగా పాలు పొయ్యి" అంది .

"అట్టాగేనమ్మా!"

సీత చేతిలోని గిన్నె అందుకుని బక్కెట్‌లోని పాలు కొలిచి అందులోపోసి గిన్నెని సీతకందించి వెళ్ళిపోయాడు పాలవాడు.

పాపం! ఆ మోహన్ ఎంతో మంచివాడిలా వున్నాడు. అన్నీ బాగా పట్టించుకుంటున్నాడు వంటకి కావాల్సిన గిన్నెలు, స్టవ్ అన్నీ ఇచ్చాడు. ఆఖరికి మంచం కూడా ఇచ్చాడు. అన్నీ వెంటనే కొనుక్కుని ఆయన సామానులు ఆయనికి పంపించెయ్యాలి. వంట గదిలోకి వెళుతూ అనుకుంది సీత.

సీత బెడ్‌రూంలోకి వెళ్లేటప్పటికి బుచ్చిబాబు లేచి కూర్చున్నాడు.

"ఎవరొచ్చారు?" బద్ధకంగా అడిగాడు.

"పాలవాడు!" అతనికి సమాధానం చెప్పి నేలమీది చాప, దిండు తీసి చాపని చుట్టి గోడమూలకి జార్చి మంచంమీద పెట్టింది సీత.

"పాపం అతను చాలా మంచివాడులా వున్నాడు"

“ఊ! నా ఫ్రెండంటే మరేం అనుకున్నావ్?” గర్వంగా అన్నాడు బుచ్చిబాబు.

తర్వాత ఇద్దరూ పేస్టుతో పళ్ళు తోముకున్నారు.

“కాఫీ ఇస్తావా సీతా?” అన్నాడు బుచ్చిబాబు హాల్లో కుర్చీలో కూర్చుంటూ.

“ఎక్కడి నుండి ఇవ్వను? మనింట్లో కాఫీపొడి ఉందా? టీ పొడివుందా? మీ ఫ్రెండుని గిన్నెలు స్టవ్ ఇచ్చింది చాలక సరుకులు కూడా తెచ్చిమ్మంటారా?” అతని ఎదురుగా మరో కుర్చీలో కూర్చుంటూ అంది సీత. ఆ కుర్చీలు కూడా మోహన్ ఇచ్చినవే.

“మరయితే ఇప్పుడెలా? కాఫీ లేకుండా నేనుండలేనే?” తెల్ల మొహం వేశాడు బుచ్చిబాబు.

“కాఫీ లేకుండా ఎవరుండమన్నారు? వెంటనే షాప్‌కెళ్లి కాఫీపొడి, చక్కెర తీసుకురా...కాఫీ పెట్టిఇస్తా”

“పోనీ హోటల్‌కు వెళ్లి తాగేస్తేనో?”

“అలాగే ... రోజూ రెండు పూటలా భోజనం కూడా హోటల్లోనే చేసేద్దాం. అప్పుడుగానీ నువ్వు అప్పులపాలు కావు. లేలే!” అంది సీత.

బుచ్చిబాబు బయటకెళ్ళి చక్కెర, కాఫీపొడి తీసుకొచ్చాడు. సీత వంటగదిలో కాఫీ కలువుతుంటే బుచ్చిబాబు గుమ్మానికి ఆనుకుని నిల్చున్నాడు.

“కాఫీ తాగి, స్నానం చేసి ఏ సూపర్ బజార్‌కో వెళ్ళి పప్పులూ, బియ్యం వగైరా సామాన్లూ, కూరగాయలు అన్నీ తీసుకురా!” అంది సీత .

“అవన్నీ ఇప్పుడెందుకు సిల్లీగా” తెల్ల మొహం వేస్తూ అడిగాడు బుచ్చిబాబు.

“ఎందుకా? సిల్లీగా పుడ్డు వండుకుని తినడానికి!”

“ప్రస్తుతానికి అంత కంగారేంలేదులెండి. ఆ పని సాయంత్రం చూస్కోవచ్చు” అది మోహన్ గొంతు.

ఇద్దరూ వెనక్కి తిరిగి చూశారు.

“రాగానే మీకు కష్టం అవుతుందని ఈ రోజుకి మీకు భోజనం ఏర్పాట్లు చేసెయ్యమని మా ఆవిడతో చెప్పాను. ఇద్దరికి కాస్సేపయ్యాక క్యారియర్ పంపిస్తాను” అన్నాడు మోహన్ బుచ్చిబాబుతో.

“ఎందుకండీ మీకంత శ్రమ?” అంది సీత మొహమాటంగా.

“ఇందులో శ్రమేం వుందండీ... స్నేహితుల కోసం ఆ మాత్రం చెయ్యకపోతే ఎలా?” అన్నాడు మోహన్ సీతతో.

బుచ్చిబాబు వంక తిరిగి “నేనికి వస్తానోయ్. ఈ విషయం చెప్పడానికే వచ్చా... నువ్వు ఆఫీసులో ఈ వేళ జాయిన్ అవుతున్నావ్ కదూ?” అన్నాడు.

“అవును!” అన్నాడు బుచ్చిబాబు .

“మీరు వుండండి మోహన్ గారూ ...కాఫీ తాగేసి వెళ్దురుగాని” అంది సీత . కాఫీ

తాగుతున్నప్పుడు మోహన్ బుచ్చిబాబుని అడిగాడు “అదేంట్రా నువ్వు పెళ్ళి చేసుకున్నట్టు మాట మాత్రంగానైనా చెప్పలేదు?”

బుచ్చిబాబుకి పొరబోయి దగ్గొచ్చేసింది.

“ఇన్విటేషన్ పంపలేదు సరే... కనీసం పెళ్ళి చేస్కున్నట్టు ఓ కార్డు ముక్క రాస్తే సంతోషించి వుండే వాడినికదా”

సీత బుచ్చిబాబు వంక చూసింది ఏం సమాధానం చెప్తాడోనని. అతను ఏమీ అన్లేదు. ఒక వెర్రి నవ్వు నవ్వి కాఫీని సుర్రుసుర్రుమని జుర్రడంలో మునిగిపోయాడు.